క్లుప్తంగా

పీసా కమిటీ ఎన్నికలకు డిమాండ్

డుంబ్రిగుడ: పాడేరు ఐటీడీఏ పరిధిలో వాయిదాపడిన పీసా కమిటీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు వై.ఎస్.బోసు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో గత నెలలో అన్ని గిరిజన ప్రాంతాల్లో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించి, కమిటీ సభ్యులకు పీసా చట్టంపై శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించారన్నారు. అయితే ఐటీడీఏ పరిధిలో 52 గ్రామాల్లో పీసా ఎన్నికలను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో పాటు వివిధ కారణాలతో జరగలేదని, వాటిని ప్రస్తుతం వేగవంతంగా నిర్వహించాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ఏర్పాటుచేసిన దాతలు

చింతపల్లి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు పెదిరెడ్ల గౌతమ్ యశ్వంత్‌లు తెలిపారు. వేసవి ప్రారంభం నుంచే అధికంగా ఎండలు ఉండడంతో ప్రజల దాహం తీర్చడానికి తమ వంతు సాయంగా తమ తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థంగా చలి వేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు వారు చెప్పారు. ఈ చలి వేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్పంచ్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం


పంద్రాజుపల్లిలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అభిరాం

కూనవరం: చినార్కూరు పంచాయతీ సర్పంచ్ సున్నం అభిరాం చొరవతో పంద్రాజుపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను మంగళవారం పరిష్కరించారు. గ్రామ పంచాయతీ నిధులతో స్థానికుడు కట్టం వీరయ్య ఇంటి ముందు నుంచి సుమారు 375 మీటర్లు పొడవున పైపులైన్ ఏర్పాటుచేసి కుళాయిల ద్వారా కాలనీలో నీటి సరఫరా చేపట్టారు. ఎంపీపీ పాయం రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి శివమణికంఠ, వార్డు సభ్యులు కనకదుర్గ, ఉపాధ్యాయుడు వీరయ్య తదితరులు పాల్గొన్నారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు సర్పంచ్ అభిరాంనకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


గిరిజనులకు దుప్పట్లు, చీరలు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీ ఎంసీడీ క్యాంప్ గ్రామంలో చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్ మంగళవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు, చీరలు, పిల్లలకు పుస్తకాలు, యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం


కుజబంగిలో దగ్ధమవుతున్న గడ్డి వాములు

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కుజబంగి గ్రామంలో గడ్డి వాములు దగ్ధమైన సంఘటనలో స్థానిక రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మంగళవారం మధ్యాహ్నం గడ్డి వాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిబూడిదైనట్టు వాపోయారు. తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కిల్లో త్రినాథ్, కెశోబో, లచ్చన్న, లైకోన్‌లు కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. అభ్యర్థులు ఎంసీఏ, ఎంటెక్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 55 శాతం ఉత్తీర్ణత శాతం సాధించి ఉండాలన్నారు. ఎస్‌సీ, ఎస్‌టీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికేట్లతో ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.


షెడ్డులో నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం


మండల పరిషత్ ప్రాంగణ గోడౌన్‌లో ఉన్న మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయం

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- గోడౌన్లే వ్యవసాయశాఖ కార్యాలయాలు
- శిథిలావస్థ భవనాల్లోనే నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖకు సొంత భవనాలు లేక పరాయి పంచన విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ శాఖకు పక్కా భవనం ఉండేది. వ్యవసాయ శాఖకు సబ్ డివిజనల్ అధికారి కార్యాలయంతో పాటు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, భూసార సంరక్షణ కేంద్రాలు ఉండేవి. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆ భవనాలు మూలకు చేరాయి. ప్రస్తుతం పలుశాఖల శిథిలషెడ్డుల్లో కొనసాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అగ్రిల్యాబ్ ఏర్పాటు

గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో పాడేరు నియోజకవర్గ స్థాయిలో అగ్రిలాబ్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన పాత భవన ప్రదేశంలో సుమారు రూ.50లక్షలతో విత్తన, ఎరువులు, పురుగుమందుల నాణ్యత పరీక్ష కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను అధునాతన సౌకర్యాలతో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం వ్యవసాయశాఖకు పక్కా భవనం లేక విధుల నిర్వాహణకు అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.


వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం

శిథిల షెడ్డులే శరణ్యం

డైరీ ఫారంలో గల రేకుల షెడ్డులో గతంలో రైతు భరోసా కేంద్రంగా కొనసాగింది. ఆర్‌బికేకు నూతన భవనం ఏర్పాటు కావడంతో ప్రస్తుతం ఆ రేకుల షెడ్డులోనే చింతపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం కొనసాగుతోంది. సబ్ డివిజన్ పరిధిలో గల చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ప్రతి కార్యక్రమానికి, సమావేశాలకు చింతపల్లి రావలసి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఈ శాఖకు కనీసం భవన సౌకర్యం లేక పరాయి శాఖకు చెందిన శిథిలావస్థ షెడ్డుల్లో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఆ షెడ్డు సైతం శిథిలస్థితికి చేరుకుంది. వర్షం పడితే నీరు కారడంతో విలువైన రికార్డులు, సామగ్రి తడిసిపోతుండడంతో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పురుగు మందులు ఎరువులు, ఇతర సామగ్రిని భద్రపరుచుకోవడానికి ఒక భవనాన్ని గోడౌన్‌గా ఉపయోగించుకొనేవారు. ప్రస్తుతం ఆదే భవనంలో వ్యవసాయ శాఖ మండల అధికారి కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఆ భవనం సైతం పూర్తిగా పాడవడంతో చిన్న చినుకు పడితే వస్తువులు, రికార్డులు భద్రపరుచుకోవడానికి అవస్థలు పడుతున్నారు. పూర్తిస్థాయి కార్యాలయ భవనం సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో వ్యవసాయ శాఖకు పక్కా కార్యాలయ భవనం లేక ఇబ్బందులు పడుతున్నా ఆ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు గాని ప్రభుత్వం గాని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వ్యవ సాయ శాఖకు నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

వ్యవసాయశాఖకు నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మండల కేంద్రంలో వ్యవసాయ శాఖకు పక్కా భవనం లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరైన వెంటనే యంత్రాంగం ఆదేశాల మేరకు స్థల సేకరణ చేపట్టి భవన నిర్మాణం పనులు చేపడతాం.

– కంతా జాహ్నవి,
వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, చింతపల్లి

ప్రశాంతంగా ముగిసిన ‘పది’ పరీక్షలు


ముంచంగిపుట్టులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


రాజవొమ్మంగిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


అడ్డతీగలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలు, జోలాపుట్టులో ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరిగాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 477 మంది విద్యార్థులకు గాను చివరి రోజు సోషల్ పరీక్షకు 473 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు పూర్తిస్థాయిలో గస్తీని నిర్వహించారు. ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో నిర్వాహకులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

రాజవొమ్మంగి: మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు జరిగిన సోషల్ పరీక్షకు మొత్తం 421 మంది హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. మార్చి 17న ప్రారంభమైన టెన్త్ పరీక్షలు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా పరీక్షలు ముగిసినట్టు ఆయన చెప్పారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాశారని, ఎవరూ మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడలేదని, ఈ ఏడాది ఎవరూ డీబార్ కాలేదన్నారు.

అడ్డతీగల: మండలంలోని పదో తరగతి పరీక్షలు మంగళవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. చివరి రోజు జరిగిన పరీక్షకు 364 మందికి గాను 363 మంది పరీక్షలు రాసినట్టు, ఒకరు గైర్హాజరైనట్టు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఉపాధి పనుల ప్రణాళికపై శిక్షణ


మాట్లాడుతున్న ఏపీఎం సుందరమ్మ

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో యానిమేటర్ల, వీఏవోలకు ఆన్‌లైన్‌లో ఉపాధి పనుల వివరాల అప్‌లోడ్, ప్రణాళిక అమలు తదితర అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏపీఎం పి.సుందరమ్మ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘాలకు వార్షిక అప్పులు, జీవన ఉపాధిల ప్రణాళిక తయారీలపై పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను విధుల్లో అమలు చేయాలని సూచించారు. వెలుగు సీసీ శ్రీరాములు, గురు, త్రినాథ్, యానిమేటర్లు, వీవీవోలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి

- గిరిజనేతరుల ఆగడాలపై ఫిర్యాదులు
- గిరిజన చట్టాలను పరిరక్షించాలి
- కించుమండ గ్రామస్తుల డిమాండ్


తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కించుమండ గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సచివాలయం పరిధిలో 1/70 చట్టానికి విరుద్ధంగా ఓ గిరిజనేతరుడు నిర్మిస్తున్న దుకాణ సముదాయంతో పాటు శాశ్వత గృహాన్ని తక్షణమే తొలగించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు, స్థానిక యువత సచివాలయాన్ని ముట్టడించారు. సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం డుంబ్రిగుడ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కించుమండ వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి, రామునాయుడులు మాట్లాడుతూ స్థానిక ఎస్‌బీఐ వద్ద ఉన్న స్థలంలో గిరిజనేతరులు అక్రమంగా దుకాణాలతో పాటు గృహ నిర్మాణంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్రమదారుడికి నోటీసులు ఇచ్చారని, అయినా బేఖాతరుతో పనులు చేస్తున్నారని, తక్షణమే పనులు నిలిపివేయాలని ఆందోళన చేపట్టామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా అక్రమ నిర్మాణాలను తొలగించి గిరిజనుల రక్షణ కవచమైన 1/70 చట్టాన్ని కాపాడాలన్నారు. వార్డు సభ్యులు ముత్యాలనాయుడు, పెంటన్న, మత్స్యరాజు, దేవినాయుడు, స్థానికులు వరుణ్, కొండబాబు, చిన్న, నర్సయ్య, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


కిలగాడలో ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలు, సీఐటీయూ నాయకులు

ముంచంగిపుట్టు: సీహెచ్‌డబ్ల్యూలను (కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు) ఆశ వర్కర్లుగా మార్పు చేయాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు కోరారు. మండలంలో గల కిలగాడ పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూలతో సీఐటీయూ నేతలు సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీహెచ్‌డబ్ల్యూలకు, ఆశలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఒప్పందం జీవోను వెంటనే విడుదల చేయాలని, ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. ఈ మేరకు సీహెచ్‌డబ్ల్యూల సమస్యలపై ఈనెల 11న పాడేరులో జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించ ని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తాజంగిలో నిరసన తెలియజేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలతో సీఐటీయూ నాయకుడు ధనుంజయ్

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహించే సామాజిక ఆరోగ్య కార్యకర్తలను (సీహెచ్‌డబ్ల్యూ) ఆశ వర్కర్లుగా మార్పుచేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం కార్యకర్తలతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లుతో సమానంగా సామాజిక ఆరోగ్య కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం వీరికి వర్తించడం లేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11 పాడేరులో చేపడుతున్న ధర్నాను అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సూర్యకుమారి, వరలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి


సబ్ కలెక్టర్ కల్పశ్రీకు సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు

రంపచోడవరం: పోలవరం నిర్వాసితులకు కేటాయించిన స్థలాలను చదునుచూసి అందజేయాలని కోరుతూ దేవీపట్నం మండలం తొయ్యేరు గ్రామానికి చెందిన పలువురు రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దేవీపట్నం పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పోలిశెట్టి శివరామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. దేవీపట్నం మండల తొయ్యేరు గ్రామానికి చెందిన పలువురు నిర్వాసితులకు గోకవరం మండలం కృష్ణునిపాలెం కాలనీలో ఇంటి స్థలాలు కేటాయించారని పేర్కొన్నారు. అయితే గృహ నిర్మాణాలకు స్థలాలను చదును చేసి ఇవ్వాలని కోరారు. తొయ్యేరు గ్రామంలో సుమారు 90 మంది వరకు నిర్వాసితులున్నారని వారిని అర్హులుగా గుర్తించేందుకు గ్రామసభ నిర్వహించాలన్నారు. కృష్ణునిపాలెం కాలనీలో సీసీ రోడ్డు, ప్రహరీతో పాటు సామాజిక భవనాన్ని నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ కల్పశ్రీ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

అడ్డతీగల: మండలంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులకు మొదటి రోజు మంగళవారం విద్యార్థులు స్వల్ప సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ కళాశాలలు మంగళవారం తెరుచుకున్నాయి. స్థానిక ఎస్ఏసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 149 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గాను ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. తరగతులకు సంబంధించి విద్యార్థులకు ఇప్పటికే సమాచారమిచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సున్నం రాజేంద్రస్వామి తెలిపారు. గురుకుల జూనియర్ కళాశాలలో 93 మంది విద్యార్థులుండగా ఒక్కరే హాజరైనట్టు చెప్పారు. అడ్డతీగలలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొనసాగుతున్న ప్లస్ టు కళాశాలలో 14 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి రోజు ఇద్దరే హాజరైనట్టు ఉపాధ్యాయుడు ఆశీర్వాదం తెలిపారు.

నేలకొరిగిన భారీ వృక్షం

- మూడు రోజులుగా రాకపోకలకు ఆటంకం
- అధికారులు స్పందించాలని గ్రామస్తుల వినతి


తెప్పలమామిడి గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

చింతపల్లి: మండలంలో ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలోని తెప్పలమామిడి గ్రామ సమీపంలో రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎర్రబొమ్మలు ఎంపిటీసీ సెగ్గె సత్తిబాబు కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి మండలం పెద్దగెడ్డ నుంచి ఎర్రబొమ్మలు, ఎర్రబంద, తెప్పలమామిడి గ్రామాల మీదుగా శరభన్నపాలెం, కేడీ పేట వెళ్లేందుకు అడ్డురోడ్డు కావడంతో ఇటీవల కాలంలో వాహనాలు రాకపోకలు పెరిగాయన్నారు. ఉగాది రోజున తెప్పలమామిడి గ్రామ సమీపంలో భారీ వృక్షం నేల కొరగడంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు నిలిచిపోయినట్టు చెప్పారు. దీంతో గడిచిన మూడు రోజులుగా వాహనాలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారీ వృక్షం కావడంతో స్థానికులతో తొలగించడానికి కుదరడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భారీ వృక్షాన్ని తొలగించి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు కోరారు.

మూగజీవుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టెలు


గడబపాలెంలో తొట్టె నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సీతయ్య


నర్సీపుట్టులో నీటి తొట్టెను ప్రారంభిస్తున్న ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ రమేష్


వి.ఆర్.పురంలో నీటితొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం


చింతపల్లిలో నీటితొట్టెల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ పుష్పలత

కొయ్యూరు: త్వరితగతిన నీటితొట్టెలను నిర్మించాలని చింతపల్లి క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ సీతయ్య ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పశువులకు నీటి ఇబ్బందులు లేకుండా తొట్టెలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. గడబపాలెంలో నీటితొట్టె నిర్మాణాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో తొట్టె నిర్మాణానికి ఉపాధి పథకం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. నీటి వనరులు ఉన్న ప్రదేశాల్లోనే తొట్లెను నిర్మించాలని సూచించారు. కొయ్యూరు మండలానికి సంబంధించి ముందుగా 21 తొట్టెలు మంజూరైనట్టు చెప్పారు. పంచాయతీకి ఒకటి చొప్పున నిర్మిస్తామన్నారు. ఏపీవో అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ నర్సిపుట్టు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన నీటి తొట్టెను ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి తొట్టెలు మూగజీవులకు దాహం తీర్చేందుకు ఉపయోగపడతాయన్నారు. ప్రతి రైతు తొట్టెలను నిర్మించుకోవాలని, ఉపాధి నిధులను వినియోగించుకోవాలని కోరారు. ఏపీవో సంఘంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జయదేవ్, వార్డు సభ్యులు జయరాం, బొందు, పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులు గంగరావు, దామోదరం, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో ఉపాధి పథకం ద్వారా నీటి తొట్టెల నిర్మాణ పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల దాహార్తి తీర్చేందుకు రైతులు నీటి తొట్టెలను నిర్మించుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలానికి 12 యూనిట్లు మంజూరైనట్టు చెప్పారు. ఏపీఎం రాజు, ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: రాజుపేట కాలనీలో నీటితొట్టెల నిర్మాణ పనులకు ఎంపీటీసీ సభ్యురాలు వి.భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ ముంజపు రాము మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న తొట్టెలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ సుగ్గిరెడ్డి నీటి తొట్టెల నిర్మాణంపై పలు సూచనలిచ్చారు. సాయిబాబు, దుర్గారావు, చలపతిరావు, సాయికృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈతలపాడులో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: మండలంలోని తామరపల్లి పంచాయతీ ఈతలపాడు గ్రామంలో సికిల్‌సెల్ ఎనిమీయా, వితంతులకు మంజూరైన కొత్త పింఛన్లను ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ మంగళవారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు చెల్లబ్బాయి, కార్యదర్శి రవి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, విజయ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయిని పూజలు

నాతవరం : మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్దిపట్నం గ్రామంలో శ్రీదుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణమూర్తి శర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరి స్వామికి, ఆంజనేయ స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.